



పెన్‌గంగా నదిలో ఈత కొడుతున్న యువకులు

చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలు దూరం

1. ఈత కొట్టేందుకు సరదా పడిన పిల్లలకు తల్లిదండ్రుల సంరక్షణలోనే ఈతను నేర్పించాలి.
2. ఆడ, మగ అనే తేడా లేకుడా పిల్లలందరికీ తప్పనిసరిగా ఈత వచ్చేలా జాగ్రత్త పడాలి.
3. ఈతరాని వారు దాదాపుగా నీళ్ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్త పడితేనే మంచిది.
4. గ్రామీణ ప్రాంతాల్లో సోరకాయ బుర్రలు, పాత ట్యూబ్ టైర్లలో గాలిని నింపి పిల్లలు ఈతను నేర్చుకునే ప్రయత్నం చేస్తుంటారు. కానీ ఇదంతా సురక్షితమైనదేమీ కాదు.
5. నాణ్యమైన గాలి ట్యూబులను పిల్లలకు తొడగించి ఈత నేర్పించాలి. పిల్లలకు గాలి ట్యూబులు సరైన సైజులో ఉండే విధంగా జాగ్రత్త పడాలి.
6. చెరువులు, కుంటలు, జలపాతాలు, నదుల ఘాట్ల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి నీటి లోతు ప్రమాదకర విషయాలను స్పష్టంగా తెలపాలి.



● మావలలో ఇటీవల ప్రమాదం జరిగిన నీటికుంట వద్ద పోలీసులు, స్థానికులు

తస్మాత్ జాగ్రత్త!

» జిల్లాలో నీటి ప్రమాదాల బారిన పడి గాలిలో కలుస్తున్న ప్రాణాలు » ఇటీవల మావలలో నీటమునిగి ఇద్దరు విద్యార్థుల మృతి
» అడ్డగోలుగా క్వారీ గుంతలు.. చెరువుల్లో అక్రమ తవ్వకాలు » కనిపించని ప్రమాద హెచ్చరిక బోర్డులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వేసవిలో ఈత సరదా పలువురి ప్రాణాలను బలి తీసుకుంటోంది. ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. పట్టణ, గ్రామాల సమీపంలో ఉన్న చెరువులు, కుంటలు, వాగులు, నదులు, జలపాతాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ముఖ్యంగా సెలవులు, పండుగలు, విహారయాత్రల సమయంలోనే ఈత సరదా మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈత సరదతో కొందరు ప్రమాదాల భారీన పడుతుండగా.. జలపాతాల వద్ద సెల్ఫీలు దిగే క్రమంలో మరికొందరు ప్రమాదంలో ఉన్న వారిని కాపాడబోయి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. జిల్లా సరిహద్దుల్లో ప్రవహిస్తున్న పెన్‌గంగా నదితో పాటు నేరడిగొండ మండలం కుంటాల జలపాతం, బోథ్ మండలం పొచ్చెర జలపాతం, సాత్నాల, మత్తడి ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు, కంకర, మొరం, క్వారీలలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల మావల మండలం చెరువు కుంటలో ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు ప్రమాదవశాత్తు మృతి చెందడం జిల్లాలో కలకలం రేపుతోంది. ఇప్పటికే పాఠశాలలకు ఒంటిపూట బడులు మొదలు కావడం, పదవ తరగతి, ఇంటర్ మీడియట్ పరీక్షలు ముగిసి పోవడం, జిల్లాలో ఎండల తీవ్రత మరింత పెరిగి పోవడంతో.. నీటిలో సేద తీరేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఈ క్రమంలో సరదాగా ఈత కోసం వెళ్లి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. వేసవిలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకుంటే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



● జిల్లా సరిహద్దులో ప్రవహిస్తున్న పెన్‌గంగా నది

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి..

: పి.సురేష్ కుమార్, అగ్నిమాపక శాఖాధికారి, ఆదిలాబాద్

వేసవి కాలంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. సెలవుల్లో విద్యార్థుల పై ప్రత్యేక దృష్టిని సారించాలి. ముఖ్యంగా ప్రమాదకర ప్రదేశాలకు వెళ్లకుండా కట్టడి చేయాలి. రెవెన్యూ, మున్సిపల్, గ్రామ పంచాయతీ శాఖలు సమన్వయంతో పని చేయాలి. ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. అన్ని శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటాం.

అడ్డగోలుగా తవ్వకాలు

మైనింగ్ మాఫియా ఆగడాలు మరింతగా పెరిగి పోతున్నాయి. చెరువులు, కుంటల్లో అడ్డగోలుగా మొరం తవ్వకాలను చేపడుతూ వదిలేస్తున్నారు. ముఖ్యం గా అసైన్డ్ భూములు, చెరువులు, కుంటలు, మొరం క్వారీలు బొందల గడ్డలుగా మారిపోతున్నాయి. అలాగే ఉపాధి పనులతో చెరువుల్లో కందకాలు, చేపల చెరువుల తవ్వకాలను చేపడుతున్నారు. దీంతో భారీ గుంతలు ఏర్పడుతున్నా యి. కనీసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయక పోవడంతో నీటి లోతును అంచనా వేయలేక పోతున్నారు. దీంతో సరదాగా ఈతకు వెళ్లి భారీ గుంతల్లో చిక్కుకొని ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. అప్పటి వరకు కళ్లముందే కనిపించిన వారు కొన్ని క్షణాల్లోనే విగత జీవులుగా మారిపోతున్నారు. ఎలాంటి రక్షణ లేకుండానే నీటిలోకి వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా



తరువాయి 6వ పేజీలో...



మాట్లాడుతున్న రవాణా శాఖ అధికారి రవీందర్

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

● ఉమ్మడి జిల్లా రవాణా శాఖ అధికారి

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడిచిన ఏడాది కాలంలో దాదాపు 90శాతం పన్నుల వసూళ్ల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరిందని ఉమ్మడి అదిలాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి రవీందర్ అన్నారు. ఆదిలాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిని ఉపేక్షించేది లేదని, అధిక లోడుతో వెళ్లే వాహనాలపై చర్యలు తప్పవని, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో గూడ్స్ తరఫులింపుపై ఉక్కుపా దం మోపుతామని ఆయన పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని, త్వరలోనే అదిలాబాద్‌లో చిల్డ్రన్స్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి మహిళలు దరఖాస్తు చేసుకోవాలి

జైనథ్, ఏప్రిల్ 8: జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలలో అర్హులైన యువకులతో పాటు అర్హత కలిగిన స్వయం సహాయ సంఘాల మహిళలు రాజీవ్‌యువ వికాస పథకానికి ధరఖాస్తు చేసుకోవాలని మండల ఇందిరా క్రాంతి పథం ఏపీఎం నాగుల భగవండ్లు అన్నారు. మండల కేంద్రమైన జైనథ్ ఇందిరమ్మ మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.స్త్రీ నిధి ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీలేని రుణాలను పొందాలన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను చిన్నకుటీర పరిశ్రమలకు ఉపయోగించి ఆర్థిక పరిపుష్టిని సాధించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలను ఇందిరమ్మ కమిటీల సభ్యులు సకాలంలో పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సేంద్రీయ వ్యవసాయం పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ మండల సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, కమ్యూనిటీ కోఆర్డినేటర్ టి.శ్రీనివాస్‌రెడ్డి, గోడంగంగారాం, నాందేవ్, టి.వెంకట్‌రెడ్డి, జి.శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు ఆయా గ్రామాల స్వయం సంఘాల మహిళలు పాల్గొన్నారు.



నార్నూర్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

హనుమాన్ ఆలయంలో అన్నదానం

నార్నూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాచీన హనుమాన్ ఆలయంలో భక్తులు మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా స్థానిక మాజీ సర్పంచ్ బి.గజానంద్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజలు చేశారు. తనవంతు అన్నదానానికి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

కోడి గుడ్ల వ్యాన్ బోల్తా

నేరడిగొండ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై వెళుతున్న కోడిగుడ్ల వ్యాన్ మండలంలోని కొరటికల్ గ్రామ సమీపంలో గల డౌనల్ ప్రాంతంలో బోల్తా పడిందని ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. ఆర్మూర్ నుంచి మహారాష్ట్రలోని సార్థనికి కోడిగుడ్లతో వెళుతున్న వ్యాన్ ఓ బైక్‌కు తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి బోల్తా పడినట్లు ఎస్‌ఐ తెలిపారు. వ్యాన్‌లోని కోడిగుడ్లు అన్ని పగిలిపోయాయని, ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు వెల్లడించారు. సంఘటన స్థలానికి చేరుకుని బోల్తా పడ్డ వాహనాన్ని తొలగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.



కొరిటికల్ సమీపంలో బోల్తా పడ్డ కోడి గుడ్ల వ్యాన్

శాస్త్ర సాంకేతిక విద్యను నేర్చుకోవాలి

● ఖోడద్ పాఠశాలలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా

తలమడుగు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి శాస్త్ర సాంకేతిక సాంకేతిక విద్యను నేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా కోరారు. మంగళవారం మండలంలోని ఖోడద్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐ కంప్యూటర్ విద్యను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో పమాట్లాడారు. కాగా పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న విద్యార్థికి కనీసం కూడికలు సక్రమంగా రాకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ విద్యార్థికి అర్థమయ్యే విధంగా విద్యా బోధన అందించాలని సూచించారు. అదే విధంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలన్నారు. విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా కష్టపడి చదువుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో స్థలం ఎక్కువ ఉన్నందున.. హరిత పాఠశాల ఏర్పాటు చేయాలని అధికారులకు కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు సిబ్బంది విన్నవించారు. ఇందులో తహసీల్దార్ రాజమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో వెంకట్రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణకుమారి, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో అమలవుతున్న ఏఐ విద్యను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్



ఉట్నూర్‌లో హోటళ్లపై దాడులు నిర్వహిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు



ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్న గ్యాస్ సిలిండర్లు

హోటళ్లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉట్నూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): 'పక్కదారి పడుతున్న సిలిండర్లు' శీర్షికన ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చిన కథనంపై పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్పందించారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని హోటళ్లు, టీ స్టాల్స్ స్వీట్ షాప్‌పై మంగళవారం దాడులు నిర్వహించి అక్రమంగా వినియోగిస్తున్న గృహ అవసరాల 12 సిలిండర్లను ఆయా హోటళ్లతో స్వాధీనం చేసుకున్నారు. వ్యాపార కేంద్రాలలో డొమెస్టిక్ సిలిండర్లు వాడడం సరైంది కాదని, వ్యాపార కేంద్రాల వారు కమర్షియల్ సిలిండర్లు మాత్రమే వినియోగించాలని వారు ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ సందర్భంగా పలు హోటల్స్ యజమానులపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రేమ్‌నివాస్, మధుసూదన్, రామారావు, బాబుసింగ్‌లతో పాటు ఉట్నూర్ తహసీల్దార్ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ అమృతలాల్, గిర్ధావర్ అనిత, తదితరులున్నారు.



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీవో ఖుష్బుగుప్తా

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన పీవో

ఉట్నూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాల, గురుకుల పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన గిరిజన విద్యార్థులకు గిరిజన శిక్షణ సహాయం పథకం ద్వారా రెండు సంవత్సరాలు ఇంటర్మీడియట్ (ఎంపీసీ)యందు ప్రవేశం, ఉచిత ఐఐటీ జేఈఈ శిక్షణ కోసం నిర్వహించిన ఎంపిక పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మంగళవారం మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో 586 మంది విద్యార్థులకు 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కొనసాగే సమయంలో కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష సమయం కంటే గంట ముందు నుంచే విద్యార్థులను లోనికి అనుమతించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఏఎన్ఎంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. గిరిజన శిక్షణ సహాయం ఐఐటీ, జేఈఈ, ఎంసెట్ పరీక్షకు 586 మంది దరఖాస్తులు చేయగా పరీక్షకు 538 మంది విద్యార్థులు హాజరు కాగా, 48 మంది గైర్హాజరైనట్లు పీవో తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు పరీక్ష రాస్తున్న విధానాన్ని పరిశీలించి భయం లేకుండా పరీక్షలు రాయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూచించారు. అలాగే, పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తును పరిశీలించారు.

ట్రైబల్ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కాలేజ్ రోడ్‌లోని ట్రైబల్ పురుషుల డిగ్రీ కళాశాలలో 2025-26 సంవత్సరానికి గాను డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అడ్మిషన్‌లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివకృష్ణ ప్రకటనలో తెలిపారు. బీఏ (హెచ్‌ఈపీ), బీ కామ్(సీఏ), బీ ఎస్సీ, బీజెడ్‌సీ, డాటా సైన్స్, స్టాటిస్టిక్స్ ఉన్నాయని తెలిపారు. వివరాలకు సెల్ ఫోన్ నెం. 9849390495, 8309511010, 7901097689 ద్వారా సంప్రదించాలని సూచించారు.

ఉన్నత ఆశయంతో చదవాలి : ఎంఈవో

ఉట్నూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత ఆశయాలతో చదువుకోవాలని ఎంఈవో రాపెల్లి ఆశన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఏడవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉన్నత పాఠశాలలకు వెళ్తున్నందున అక్కడి విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి మెలిసి ఉండి ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విని బాగా చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏడవ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు తమ భావాలను ఉపాధ్యాయులతో వారి సఖ్యతను, తమ మాటలలో వివరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల విద్యాధికారి ఆశన్న

మూకుమ్మడి సెలవుల్లో మున్సిపల్ ఉద్యోగులు!

● ఆదిలబాద్‌లో బోసిపోయిన రెవెన్యూ విభాగం ● బల్దియాలో స్తంభించిన పౌర సేవలు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మున్సిపాలిటీలో రెవెన్యూ వ్యవస్థ స్తంభించింది. ఆ విభాగంలో కీలకమైన, బల్దియా పరిపాలన వ్యవహారాలను పర్యవేక్షించే కీలక బాధ్యతల్లో ఉన్నా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి సహా, మున్సిపల్ మేనేజర్ సహా పలువురు ఉద్యోగులు 6 రోజులుగా మూకుమ్మడిగా విధులకు గైర్హాజరు కావడం బల్దియాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకేసారి ఇంతమంది అధికారులు విధుల్లో లేకపోవడం సర్వత్రా చర్చ సాగుతుంది. ఇప్పటికే పన్నుల వసూళ్లలో బల్దియా వెనుకబడిపోయింది. గతేడాది లక్ష్యంలో సగానికే పరిమితమైంది. తాజాగా 25-26 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వం 5 శాతం రాయితీని కల్పిస్తోంది. ఇంతటి కీలకమైన తరుణంలో ఇంతమంది అధికారులు గైర్హాజరుపై దుమారం రేపుతోంది. అయితే వీరంతా సెలవుపై వెళ్లారా? లేక అధినాకారికంగానే విధులకు రావడం లేదా? అంటూ చర్చ సాగుతుంది. ఇదిలా ఉంటే పలు వురు అసెస్మెంట్‌లు, మ్యుటేషన్‌ల, ఇంటి నంబర్ల కోసం కార్యాలయానికి వస్తూ.. రెవెన్యూ విభాగంలో ఏ ఒక్కరు అందుబాటులో లేక కుర్చీలన్ని ఖాళీగా ఉండడం చూసి నిరాశగా వెనుదిరుగుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజును వివరణ కోరగా.. వారంతా సెలవుపై వెళ్లినట్లు తెలిపారు. అలా వెళ్లొచ్చా.. అని ప్రశ్నించగా వెళ్లొచ్చు అంటూ చెప్పడం గమనార్హం.





● మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు ఇలా..

11న దుకాణ సముదాయాలకు వేలం

ఇచ్చోడ, ఏప్రిల్, 8(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆరు వ్యాపార దుకాణా సముదాయాలకు సంబంధించి ఈ నెల 11న గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి లక్ష్మణ్ అధ్యక్షతన ఈ వేలం పాట నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ ఈవో సూర్యప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ తెగల కలాలకు సంబంధించిన ఇచ్చోడ స్థానికులకు మాత్రమే ఈ వేలంపాటలో అర్హులని ఆయన పేర్కొన్నారు. వేలంలో పాల్గొనేవారు 11న మధ్యాహ్నం 12గంటల లోపు రూ.75 వేల డీడీలు గ్రామ పంచాయతీలో సమర్పించాలని, వారు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. దుకాణా సముదాయాలకు వేలం వేసిన వారిలో నెగ్గిన వ్యక్తి మాత్రమే వ్యాపారం చేయాలని ఇతరులకు లీజ్, సబ్ లీజ్‌కు ఇవ్వరాదని పేర్కొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

గుడిహత్నూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని ఎస్సై కే.మహేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన వసతులను సద్వినియోగం చేసుకుని మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రూప్-2 అధికారిగా ఎంపికైన ఎస్సైని స్కూల్ సిబ్బం సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి పట్టివేత

ఉట్నూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరుసాయిపేట వద్ద కరీంనగర్‌కు గంజాయి తరలించడానికి సిద్ధంగా ఉన్న ఇద్దరిని గంజాయితో మంగళవారం పట్టుకున్నామని ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు ఉట్నూర్ ఇన్‌చార్జీ ఎస్సై దుబ్బాక సునిల్ బీర్సాయిపేట గ్రామంలో ఇద్దరు వ్యక్తులు గంజాయితో వారి ఇంటి నుంచి బయలుదేరి బస్సులో కరీంనగర్ వెళ్లుటకు సిద్ధం అవుతుండగా లక్కేటిపేటకు చెందిన సట్ల గంగన్న, బీర్సాయిపేటకు చెందిన జైసేని ఎల్లయ్యల వద్ద రెండు సంచులలో ఉన్న గంజాయి కలిగి ఉండి వారు మహారాష్ట్రలో గుర్తుతెలియని వ్యక్తుల దగ్గర నుంచి కొనుక్కొని వచ్చి వాళ్ల ఇంటి దగ్గర పెట్టుకొని మంగళవారం కరీంనగర్ గాని హైదరాబాద్‌గాని వెళ్లి ఎక్కువ రేట్లకు అమ్ముకుందామని ఉద్దేశంతో బస్సు కోసం బయలుదేరుతుండగా ఇన్‌చార్జి ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకోవడం జరిగిందన్నారు. కాగా, వారి వద్ద నుంచి సుమారు 4.900 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

పట్టా మార్పిడిపై తహసీల్దార్ విచారణ

బోథ్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి) గ్రామంలో ఉన్న నీటి కుంట పట్టా మార్పిడిపైన మంగళవారం స్థానిక తహసీల్దార్ సుభాష్‌చంద్ర విచారణ చేపట్టారు. అయితే కుంట స్థలాన్ని పట్టా మార్పిడికి పాల్పడిన జాదవ్ గోపాల్‌ను పిలిచి విచారించారు. అంతేగాక గతంలో భూమి విక్రయించిన వారిని సైతం కార్యాలయానికి పిలిపించి విచారణ చేశారు. అయితే గ్రామస్థులు మాత్రం ఈ స్థలాన్ని ఇరిగేషన్ శాఖకు అప్పగించాలని తహసీల్దార్‌కు విన్నవించడం జరిగింది. ఏదేమైనా ఈ పట్టా మార్పిడిలో కీలకపాత్ర పోషించింది ఎవరనేది తెలుసుకునేందుకు గ్రామస్థులు ప్రయత్నించారు. అయితే అందుకు సంబంధించిన రికార్డులు దొరకడం లేదని తహసీల్దార్ పేర్కొన్నారు. రికార్డులు దొరకగానే పూర్తి వివరాలు గ్రామస్థుల ముందు ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

బోథ్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌట(బి) ఉన్నత పాఠశాలలో చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది బాలల హక్కులకు భంగం కలిగితే 1098 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ సతీష్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కౌట(బి) గ్రామం ఉన్నత పాఠశాల చైల్డ్ హెల్ప్ లైన్‌పై విద్యార్థుల అవగాహన కలిగించారు. విద్యార్థుల హక్కులకు భంగం కలిగినట్లయితే ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫోన్ చేసిన వారి నెంబర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రధానోపాధ్యాయుడు శశిధర్ రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బోథ్‌లో షాదీ ముబారక్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే



కుమారి గ్రామంలో జొన్న పంటను పరిశీలిస్తూ..

పేదల సంక్షేమం కోసం కేసీఆర్ కృషి

● బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ● పలువురు లబ్ధిదారులకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కుల అందజేత

సోనాల/బోథ్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల సంక్షేమ కోసం పని చేసే స్వరాష్ట్ర ప్రజల ఇబ్బందులు తొలగించాలన్న దృక్పథంతో మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కృషి చేశారని, ఆనాటి పథకాలే ఇప్పటి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. మంగళవారం బోథ్ తహసీల్దార్ కార్యాలయం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీ, ముబారక్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోసం చేతగాని హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగానే షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఇస్తామని మాట ఇచ్చి మోసం చేశారన్నారు. గత ప్రభుత్వంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా చేపట్టడం జరిగిందన్నారు. అయితే అప్పుడు ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం వల్ల ఎంతోమంది ప్రతిరోజు నీటిని వినియోగించుకుంటున్నారన్నారు. గతంలో పథకాన్ని విమర్శించిన వారి ఇప్పుడు పథకం బాగుందని ప్రశంసిస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో బోథ్, సోనాల మండలాల తహసీల్దార్లు సుభాష్ చంద్ర, మల్లేష్, పార్టీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ సంధ్యారాణి, మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, ఆత్మ మాజీ చైర్మన్ మల్లెపూల శుభాష్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, బొడ్డు శ్రీనివాస్, అల్ల కొండ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

● నియోజకవర్గం నుంచి 4 వేల మంది కార్యకర్తలు

బోథ్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్ల పూర్తి అవుతున్న తరుణంలో రజతోత్సవ వేడుకలను వరంగల్ జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుంచి పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రజల కోసం దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు తీసుకొచ్చి అమలు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశాలకు గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలను తీసుకువచ్చిన ప్రతి నాయకుడు కృషి చేయాలని, నియోజకవర్గం నుంచి మొత్తం నాలుగు వేలకు పైగా మంది తరలింపునకు ఏర్పాట్లు చేయాలన్నారు.

● జొన్న పంటను పరిశీలించిన ఎమ్మెల్యే

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గ్రామంలో అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతు వెంకటరమణ జొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా అకాల వర్షాల కారణంగా నష్టపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే సంబంధిత అధికారిని పిలిచి వారితో మాట్లాడి నష్టపోయిన రైతులను న్యాయం చేయాలని నష్టపోయిన పంటల డాటాను తనకు అందించాలని సూచించారు. ఆయన వెంట మండల నాయకులు ఉన్నారు.

అలాగే, మండలంలోని కుమారి గ్రామం నుంచి గాజిలి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేసిన రూ.రెండు కోట్ల 19 లక్షలతో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మంగళవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, అధికారులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌చౌక్‌లో చలివేంద్రం ప్రారంభం

ఉట్నూర్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): లక్కారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్‌చౌక్‌లో అజ్మీరా జయచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గండికోట మొగిలి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండలు మండిపడుతున్నందున బాటసారులకు, వాహనదారులకు మంచినీరు అందించడానికి యువనాయకులు జయచంద్ర ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం భాగుందన్నారు. ఇందు రఘు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాజాగౌడ్, గౌడ సంఘం మోకుదెబ్బ రాష్ట్ర నాయకులు లింగగౌడ్, దూట రాజేశ్వర్, గొల్లపల్లి నర్సయ్య, శ్రీనివాస్, తదితరులున్నారు.

అంబేద్కర్ జయంతిని జయప్రదం చేయండి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఈనెల 14న జరిగే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ డోంగ్రే మారుతి పటేల్‌తో పాటు అంబేద్కర్ సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ జయంతికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.

ఆదిలాబాద్ నూతన డీఈవోకు సన్మానం

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస రెడ్డిని ఎస్ఎస్‌సీ స్పాట్ సెంటర్ సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ క్యాంప్ కార్యాలయంలో హిందీ భాషా సేవా సమితి భాషా సేవా సమితి జిల్లా అధ్యక్షులు సుకుమార్ పెట్కులే నేతృత్వంలోని సేవా సమితి సభ్యుల బృందం డీఈవో శ్రీనివాస రెడ్డికు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సేవా సమితి చేపడుతున్న సాహిత్య కార్యక్రమాల వివరాలను సేవా సమితి సభ్యులు డీఈవోకు ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కార్యవర్గ సభ్యులు పోన్నారి మహేష్, రాగీ సాంబన్న, దారట్ల శ్రీనివాస్, ప్రధాన్ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో ఎంపీడీవో తనిఖీ

బోథ్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను మంగళవారం ఎంపీడీవో రమేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక ఆయా పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న వివిధ రకాల పనులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ వలితతో పాటు సిబ్బంది ఉన్నారు.

తస్మాత్ జాగ్రత్త!

(5వ పేజీ తరువాయి...)

చెరువులు, కుంటల్లో అక్రమంగా జరుపుతున్న తవ్వకాల ను అధికారులు అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. ఇలాంటి పరిస్థితులతో తరచూ ప్రమాదాలు జరిగి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

అప్రమత్తంగా లేకుంటే ఆపదే..

ప్రతియేటా ప్రమాదాలు జరుగుతున్నా.. సంబంధిత అధికారులకు పట్టింపే లేకుండా పోయిందంటున్నారు. వేసవిలో అప్రమత్తంగా లేకుంటే ఆపదలు తప్పవంటున్నారు. ప్రమాదకర ప్రదేశాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక శాఖ, టూరిజం శాఖలు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. కానీ ఎక్కడ అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. ప్రధానంగా పెన్‌గంగా నదిలో ఇసుక తవ్వకాలు చేపట్టడంతో పాటు నీటి ప్రవాహ ఉధృతికి భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. పండుగల సమయంలో కుటుంబ సమేతంగా పుణ్యస్నానాలకు వెళ్లి చిన్నపిల్లలు ఈత సరదాతో ప్రమాదాల బారీన పడుతున్నారు. అలాగే పెన్‌గంగా నదిలో నాటు పడవల ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారుతుంది. నేరడిగొండ మండలంలో కుంటాల జలపాతం వద్ద భారీ నీటి గుంతలో పడి ఇప్పటి వరకు వందలాది మంది ప్రాణాలు కోల్పోయారు. అయినా ఇప్పటి వరకు రక్షణ చర్యలు చేపట్టడం లేదు. పొచ్చెర జలపాతం, మత్తడి, సాత్నాల వాగుల్లోనూ ప్రమాదకర ఘాట్లు ఉన్నాయి. అంతేకాకుండా జన సంచారం ఎక్కువగా ఉన్న చోట కనీసం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తే కొంతవరకైనా ప్రమాదాలను నివారించే అవకాశం ఉంటుంది.

'పాస్టర్ మృతిపై విచారణ జరిపించాలి'

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని క్రైస్తవ సమాజం డిమాండ్ చేసింది. పాస్టర్ ప్రవీణ్ పగడాలకు మృతిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ ఆదిలాబాద్‌లో క్రైస్తవ సమాజం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని క్యాథలిక్ చర్చ్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. రోజు రోజుకి క్రైస్తవులపై, పాస్టర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఈ సందర్భంగా పాస్టర్‌లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్‌లు సురేష్, రాకేశ్, సామ్యూల్, సాగర్, నాథ్నియల్, రాజు పాల్గొన్నారు.

బెట్టింగ్‌కు పాల్పడిన నలుగురి అరెస్ట్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ బి. సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ పద్మావతి కాలనీకి చెందిన గిత్తి సూర్యకాంత్, పద్వల్ పంకజ్, శాంతినగర్‌కు చెందిన నమ్మినవార్ విశాల్, టీచర్స్ కాలనీకి చెందిన అలావత్ బల్దేవ్ సింగ్ సోమవారం రాత్రి పట్టణంలోని ట్రెడ్స్ కలెక్షన్‌లో ఐపీఎల్ బెట్టింగ్ అల్ట్రావిన్ యాప్ ద్వారా బెట్టింగ్ పెడుతు ఉండగా వారిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద రూ. 2210 నగదు నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమో చేసినట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పట్టణంలో బెట్టింగ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

బాలికపై అత్యాచారం.. ఇద్దరి రిమాండ్

మావల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): 12ఏళ్ల బాలికపై నలుగురు అత్యాచారానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ కాలనీలో నివాసం ఉంటున్న బాలిక తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. స్థానికంగా ఉన్న ఓ వివాహిత ఒంటరిగా ఉన్న బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి బంధువైన యువకుడికి సమాచారం ఇచ్చింది. ఆ యువకుడి ద్వారా మరో ఇద్దరు యువకులు వచ్చి బాలికపై లైంగిక దాడి చేశారు. అయితే ఇంటికి వచ్చిన బాలికను గమనించిన తల్లిదండ్రులు అడుగగా విషయం చెప్పింది. దీంతో వారు మావల పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం నిందితులను పట్టుకొని వారిపై ఫోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలి

భైంసా, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో వేసవిలో ఎక్కడ కూడా తాగు నీటికి ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సూచించారు. మంగళవారం భైంసాలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని గ్రామీణ నీటి సరఫరా అధికారులతో తాగు నీటి సరఫరా విషయంలో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇందులో డివిజన్ పరిధిలోని ఆయా మండలాల అర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు. నియోజక వర్గ పరిధిలో వివిధ ప్రాంతాల వాసులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన అర్థిక సహయపు చెక్కులను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ బాధిత కుటుంబీకులకు అందచేశారు.

'రాజ్యాంగాన్ని మారుస్తామంటే ఊరుకునేది లేదు'

లక్ష్మణచాంద, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని మారుస్తామంటే ఊరుకునేది లేదని నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్‌లు మంగళవారం హెచ్చరించారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని మండలంలోని వడ్యాల్, నర్సాపూర్, బాబాపూర్ గ్రామాల్లో నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్, గాంధీ, చత్రపతి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వారితో పాటు మాజీ జడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మాజీ సర్పంచ్‌లు అబ్బడి ప్రతాప్‌రెడ్డి, నాయకులు బాపట్ల ఆశన్న, రాంపెల్లి రమేష్, గురాల లింగారెడ్డి, చింతకింది శేఖర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ నారాగౌడ్, కోంద్ర నరేష్‌రెడ్డి, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాఫ్రాపూర్, గంజాల్ గ్రామాల్లో ..

సోన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జాఫ్రాపూర్, గంజాల్ గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సోన్ మండలమహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రేఖ, నిర్మల్ మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు వాసవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

తానూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కోలూర్ గ్రామంలో నిర్వహించిన జై బాపూ, జై భీం, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పుండ్లీక్, నాయకులు బాశెట్టి రాజన్న, మాజీ ఎంపీపీ చంద్రకాంత్‌యాదవ్, కోఆప్షన్ సభ్యులు గోవింద్‌పటేల్, ఆత్మాచైర్మన్ పోతన్న, మాజీ ఎంపీటీసీ సురేష్‌పటేల్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలున్నారు.

'డంపింగ్ యార్డులో జంతు కళేబరాలు వేయొద్దు'

భైంసా, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారు ప్రాంతంలో కమలాపూర్ గుట్ట మార్గంలో గల డంపింగ్ యార్డులో జంతు కళేబరాలు, వాటి వ్యర్థాలు కలుపకుండా చర్యలు చేపట్టాలని భైంసా పట్టణ బీజేపీ కమిటి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం భైంసా పట్టణ బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్వర్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. బీజేపీ ప్రతినిధులు రావుల పోశెట్టి, బండారి దిలీప్, గాలి రాజన్న, వెంకటేష్, భూకిరణ్, ప్రవీణ్, అనిల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

భైంసా, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పాటుపడుతోందని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ పేర్కొన్నారు. మంగళవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల సమావేశం, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

సన్నబియ్యం పథకంతో పేదలకు చేయూత

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేదల కడుపు నింపాలనే ఉద్దేశ్యంతో తీసుకువచ్చిన సన్న బియ్యం పథకం ఎంతో చేయూత ఇస్తుందని డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మండలంలోని మేడిపల్లి గ్రామంలో సన్న బియ్యం లబ్ధిదారులు రాజుల లక్ష్మీ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు సన్న బియ్యం పథకంపై వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. సన్న బియ్యం పథకంలో పేదలు ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. సన్న బియ్యం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కుంట వేణుగోపాల్, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు సాధ సుదర్శన్, కొరిపెల్లి రామేశ్వర్ రెడ్డి, గాండ్ల విలాస్, కుంట పద్మాకర్, తదితరులు ఉన్నారు.



సన్నబియ్యం లబ్ధిదారులు రాజుల లక్ష్మీ కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేస్తున్న డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు

రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశానికి మనుగడ

దిలావర్‌పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని రక్షించుకుంటేనే దేశ మనుగడ సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. దిలావర్‌పూర్ మండల కేంద్రంలో మంగళవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కే.శ్రీహరిరావు మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వల్ల రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్నారు. దేశ ప్రజలంతా ఒక్కటై రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన తరుణం ఆసన్నమైందన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడటంతో పాటు దేశానికి అనుగుణమైన రాజ్యాంగాన్ని రచించిన మహాత్ములపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. పేద వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తక్కల విద్యాసాగర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల దేవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ పాల్దే అనిల్, పాల్దే శ్రీనివాస్, కట్కం రాజారెడ్డి, అరుగుల రమణ, మనోహర్ రావు, ఇప్ప నర్సారెడ్డి, కోడె రాజేశ్వర్, నంద ముత్యం, ధని రవి, వసీం, యూసుఫ్, అంగూర్ మహేందర్, నిమ్మ సాయన్న, దాసరి శ్రీనివాస్, బొల్లా దయాకర్, సప్పల రవి, బాలరాజు, సలీం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకుడు

మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు నంద చిన్న ముత్యం మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇథనాల్ పరిశ్రమ రద్దు కోసం ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా బీజేపీ నాయకులు ప్రవర్తించిన తీరు తనను కలిచి వేసిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమను రద్దు చేసి ప్రజాభిప్రాయాన్ని గౌరవించిందని అందుకే తాను కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు నంద చిన్న ముత్యం అన్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరిరావు నంద చిన్న ముత్యంకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని డీఆర్‌డీవో, ఎన్ఆర్ ఏజీఎస్ పీడీ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలో దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏల సమావేశంలో మాట్లాడారు. అడిగిన ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని సూచించారు. కొన్ని గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల పట్ల వివక్ష చూపుతున్నట్లు, అతిగా ప్రవర్తిస్తున్నట్లు ఫిర్యాదు వస్తున్నాయని, అటువంటి వారు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. కూలీలందరూ మనకు సమానమేనన్నారు. జాబ్ కార్డు కలిగి ప్రతీ ఒక్కరికి పని చూపించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందన్నారు. పనుల్లో అక్రమాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, తప్పనిసరిగా పని ప్రదేశంలో నీడ, మంచినీరు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలన్నా రు. ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పనిసరిగా పనుల పర్యవేక్షణ చేయాలన్నారు. కూలీలు వడదెబ్బ బారిన పడకుండా తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. అంతకుముందు పీడీ శ్రీనివాస్, ఏపీడీ నాగవర్ధన్‌లు కాల్వ, న్యూ లోలం గ్రామాల్లో ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాలను సందర్శించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎండ నుంచి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత ఫీల్డ్ అసిస్టెంట్లు, టీఏలు, పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీడీ నాగవర్ధన్, ఎంపీడీవో అరుణ రాణి, ఏపీవో దివ్యరెడ్డి, ఎంపీవో గోవర్ధన్, ఐకేపీ ఏపీఎం సులోచన రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డీఆర్‌డీవో, పీడీ శ్రీనివాస్

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

లోకేశ్వరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అబ్దుల్లాపూర్ గ్రామానికి చెందిన హనుమల భోజవ్వకు రూ. 12,000లు, జి.విజయ్ కుమార్‌కు రూ. 9,000ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు రావడంతో ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ వారికి చెక్కులను అందజేశారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోలీసుస్టేషన్ ఆవరణలో సీసీ రోడ్డు పనుల పరిశీలన

సోన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండలంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో రూ.3.5 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెరుగైన చూపు కోసం

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

● జిల్లా వైద్యశాఖాధికారి రాజేందర్

దిలావర్‌పూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మెరుగైన చూపుకోసం కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా వైద్యాధికారి డా. రాజేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని దిలావర్‌పూర్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రంలో కంటి పరీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ... జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలం దరికీ కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కంటికి సంబంధించిన వ్యాధు లను ప్రాథమిక దశలో గుర్తించి చికిత్సలు అందించినట్లయితే ఇతర కాంప్లికేషన్స్ రాకుండా కాపాడు కోవచ్చన్నారు. అనంతరం దిలావర్‌పూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారె రవీందర్, దిలావర్‌పూర్ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక, ఆప్తాల్మిక్ అధికారి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ వికాస పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మైనారిటీలు రాజీవ్ యువ వికాస పథకం ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ప్రారంభించినట్లు జిల్లా అల్ప సంఖ్యాకుల వర్గాల సంక్షేమ అధికారి ఆర్. మోహన్‌ సింగ్ పత్రికా ప్రకటనలో మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... అర్హులైన అభ్యర్థులు టీజీఎంఎస్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవలసిందిగా తెలిపారు. అదేవిధంగా ఎంపీడీవో ఆఫీస్, మున్సిపల్ కార్యాలయం నందు రాజీవ్ యువ వికాసం మాన్యువల్ అప్లికేషన్స్ తీసుకుంటున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఆఖరు తేదీ ఈ నెల 14 అని తెలిపారు.

కేంద్ర రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం అనుసరించే రైతు, కార్మిక, ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. మాస్ లైన్ కేంద్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఆ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి పాల్గొని మాట్లాడారు. నాయకులు ఆర్. రామలక్ష్మణ్, ఎం. బక్కన్న, కే లక్ష్మీ, ఎస్ గంగన్న, లక్ష్మీ, జక్కుల రాజన్న, శంకర్, భీమ్‌రావు, గోరేభాయ్, ఫెరోజ్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుని ఇంట్లో అధికారుల భోజనం

బాసర, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్నబియ్యం పథకం అమలు తీరుపై బాసర మండల అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. మంగళవారం మండలంలో టాక్లి గ్రామంలో గైని నర్సింలు అనే లబ్ధిదారుని ఇంట్లో మండల తహసీల్దార్ పవనచంద్రతో పాటు మండల అధికారులు ప్రభుత్వం పంపిణీ చేసిన సన్నబియ్యం అన్నంతో భోజనం చేశారు.ఆ తర్వాత గ్రామంలో సన్నబియ్యం పంపిణీ గురించి ఆరా తీశారు.

అర్లి(కే)లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ

నర్సాపూర్(జి), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్లి(కే) గ్రామంలో మంగళవారం సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో మాజీ శాసనసభ్యులు జి. విఠల్ రెడ్డి భోజనం చేశారు.

..మహోన్నతమైన పథకం

సోన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పేదలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకమని మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి అన్నారు. మంగళవారం కూచంపల్లి గ్రామంలో సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ పథకం ద్వారా అర్హత గల కుటుంబాలకు నాణ్యమైన బియ్యం అందుతున్నాయని చెప్పారు. ఆయనతో పాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ లింగన్న, మాజీ సర్పంచ్ బండ లింగన్న, కాంగ్రెస్ కార్యకర్తలు, అంబేకర్ ప్రసాద్, తదితరులు ఉన్నారు.



ట్రెజరీ కార్యాలయంలో పైపెచ్చులు ఊడిపడిన భవనం ఇదే..



తహసీల్దార్ కార్యాలయంలో ఊడిన పైపెచ్చులు

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయాలు..

భయం భయంగా విధులు!

- పెచ్చులూడుతున్న భవనం పైకప్పు
- ఒకే భవనంలో రెండు శాఖల విధులు
- ఎప్పుడు పైన పడిపోతుందోనని భయపడుతున్న సిబ్బంది

ముథోల్, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. భవనం పైపెచ్చులు ఊడి పడుతున్నాయి. ముథోల్ నియోజకవర్గ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని మూడు గదులలోనే కొన్ని సంవత్సరాల నుంచి ముథోల్ ఉపకోశాధికారి కార్యాలయం కొనసాగుతోంది. మిగతా గదులలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగుతోంది. అయితే ఈ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. పైకప్పు పెచ్చులు ఊడిపోతుండడంతో ఇనుప ఊచలు బయటకు తేలి భయపెడుతున్నాయి. గోడలు, స్తంభాలకు పగుళ్లు ఏర్పడి ఎక్కడికక్కడ ఊడి పడుతున్నాయి. కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందితోపాటు పనుల నిమిత్తం వచ్చే స్థానికులు సైతం ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. కార్యాలయం భవన జీవిత కాలం ముగిసినా ఇంకా అందులోనే కొనసాగించడాన్ని పలువురు విమర్శిస్తున్నారు. నిజాం కాలంలో సుమారు 1920 సంవత్సరంలో ఈ కార్యాలయ భవనం నిర్మించారని ముథోల్‌లోని వయో వృద్ధులు పేర్కొంటున్నారు. ఈ భవనం నిర్మించి వంద ఏళ్లు కావస్తుందని ఇదే భవనంలో తహసీల్దార్ కార్యాలయంతో పాటు ఎస్టీవో కార్యాలయం (ఉపకోశాధికారి కార్యాలయం)లు కొనసాగుతున్నాయి. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. భవనం స్లాబ్‌పెచ్చులు ఊడటమే కాకుండా వానోస్తే ఊరుస్తోంది. దీంతో కార్యాలయ ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులకు హాజరవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు కార్యాలయం మొత్తం తడిచి ముద్దవుతోంది. సుమారు 100 ఏళ్ల పాత భవనం కావడంతో శిథిలావస్థకు చేరింది. ఉద్యోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. తహసీల్దార్ గదితోపాటు అన్నిగదులు దెబ్బతిన్నాయి. వర్షాకాలంలో అన్ని గదుల పైకప్పు వెంబడి వర్షం నీరు జలిస్తుందని, ఏ సమయంలో ఎక్కడి నుంచి పైకప్పు పెచ్చులు ఊడుతాయోనని భయపడుతున్నారు. మరమ్మతులు చేయించినా భవనం నిలువదని, ఈకార్యాలయం భవనం కాలం చెల్లిందని గ్రామస్థులు, అధికారులు సైతం పేర్కొంటున్నారు. ముథోల్, బాసర, తానూర్ మండలాల నుంచి ఈట్రెజరీ కార్యాలయానికి అధికారులు, నాయకులు వస్తుంటారు. అంతేకాకుండా నియోజకవర్గ కేంద్రం కావడంతో పనినిమిత్తం కార్యాలయానికి అనునిత్యం ప్రజలు వస్తుంటారు. విశాలమైన స్థలం ఉంది. కానీ ప్రభుత్వం ఎందుకు నూతన భవన నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయడం లేదన్న ప్రశ్న ఉత్పన్నం అవుతుంది. పేరుకే నియోజకవర్గ కేంద్రం అన్ని సమస్యలే అని ప్రధాన కార్యాలయం నూతన భవన నిర్మాణానికి నోచుకోవడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి నియోజకవర్గ కేంద్రమైన ముథోల్ తహసీల్దార్ కార్యాలయం, ట్రెజరీ కార్యాలయానికి నూతన భవన ఏర్పాటుకు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న ముథోల్ తహసీల్దార్ కార్యాలయం ఇదే..



తహసీలార్ కార్యాలయంలోనే కొనసాగుతున్న ట్రెజరీ కార్యాలయం ఇదే..



సుర్జాపూర్‌లో హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా హనుమాన్ చాలీసా పారాయణం

ఖానాపూర్, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుర్జాపూర్ గ్రామంలోగల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అఖండ శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం యజ్ఞాచార్యులు చక్రపాణి నరసింహ మూర్తి పర్యవేక్షణలో శ్రీ హనుమాన్ సేవా సమితి అధ్యక్షుడు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం ఉపాసకులు కొండగట్టుకు చెందిన భోగ శ్రీనివాస్ గురుస్వామి బృందం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై హనుమాన్ చాలీసాను పారాయణం చేశారు. హనుమాన్ చాలీసా పారాయణానికి వచ్చిన భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కోటపల్లి అనీష్, నితీష్ సహా గ్రామానికి చెందిన ఆలయ కమిటీ బృందం, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రైతులు పండించిన జొన్న పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

త్వరలో జొన్నల కొనుగోళ్లు

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

తలమడుగు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు లక్ష ఎకరాలపైన జొన్నపంట సాగు చేస్తున్నారని, ప్రభుత్వం త్వరలోనే కొనుగోళ్లను ప్రారంభిస్తుందని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఈనెల 5న 'ఆంధ్రజ్యోతి'లో 'జొన్నపంట కొనేదెప్పుడు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. మంగళవారం తలమడుగు మండలం ఖోడద్ గ్రామ రైతు పొలంలో జొన్నపంట కోతను క్షేత్రస్థాయిలో కలెక్టర్ రాజర్షిషా పరిశీలించారు. ఈ సందర్భంగా జొన్నపంట కోస్తున్న తీరును స్వయంగా దగ్గరుండి పరిశీలించారు. కోసిన జొన్న కంకులు ఎన్ని కిలోలు ఉన్నాయో తూకం వేసి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలతో దిగుబడి అంచనా వేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో రైతులు ఎక్కువగా జొన్నపంటను వేశారని అన్నారు. ఎకరానికి ఎన్ని కిలోలు పంట వస్తుందన్న అంచనాలను ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని చెప్పారు.

కలెక్టర్ సూచనలు

పంట కోత ప్రయోగాలు పారదర్శకంగా నిర్వహించాలని, పంటకోత ప్రయోగాల ద్వారా సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వానికి అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సుమారు లక్ష ఎకరాలలో జొన్నపంటను వేయడం జరిగిందని, త్వరలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ఎకరానికి 20 కుంటల జొన్నలు కొను గోలు చేయాలని రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. అంతేకాకుండా గ్రామ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంతో రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటి సమస్యలు పరిష్కరించాలని రైతుల కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కలెక్టర్ రైల్వేఅధికారులతో, రెవెన్యూ అధికారులతో సమావేశం ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. కలెక్టర్‌వెంట తహసిల్దార్ రాజ్ మోహన్, సీపీవో వెంకట రమణ, ఎంపిడిఓ చంద్రశేఖర్, తదితరులు ఉన్నారు.



చెట్టు కింద కూర్చొని రైతు సమస్యలను వింటున్న కలెక్టర్

అటవీశాఖలో లొల్లి

- పర్మిషన్ ఇచ్చినట్టే ఇచ్చి పట్టుకున్న అధికారులు
- అజ్మీరా నరేష్ సస్పెన్షన్ ?

ఉట్నూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలో ఉన్న అటవీ శాఖ సిబ్బంది మధ్య లోలోపల లొల్లి జరుగుతున్నట్లు తెలుస్తోంది. గత ఎనిమిది నెలల క్రితం జరిగిన అటవీశాఖ అధికారులు ఉద్యోగుల ఎన్నికల్లో ఒకరిపై ఒకరు పోటీచేసుకుని విజయం సాధించిన డీఆర్ఓ నరేష్‌పై ప్రతీకార చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సిరికొండ డీఆర్‌ఓగా ఉన్న గీరయ్యపై వచ్చిన పలు ఆరోపణలతో ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు. ఎన్నికల్లో ఈయనకు అండగా ఉన్నవారు డీఆర్ఓ నరేష్‌పై ప్రతీకారం తీర్చుకోవడానికి వేచి ఉండి గతనెల 21న ఉట్నూర్‌మండలంలోని బీర్సాయిపేట కవ్వాల్ టైగర్‌జోన్ ప్రాంతంలో వెదురుబొంగులు తీసుకు వెళ్లడానికి పర్మిషన్ ఇచ్చినట్లేఇచ్చి సదరు వ్యాన్‌ను పట్టుకొని రేంజ్‌కు తరలించి ఉన్నత అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు విచారణ జరుపుతున్నట్లు తెలుస్తోంది. అడవులను కాపాడాల్సిన అటవీ శాఖ అధికారులే అడవులను అంతం చేస్తున్నట్లు విమర్శలు గుప్పుమనడంతో ఇంద్రవెల్లి రేంజ్ పరిధిలోని దనోరా డీఆర్ఓగా ఉంటూ సిరికొండ డిప్యూటీ రేంజర్‌గా ఇన్‌చార్జీ విధులు నిర్వహిస్తున్న అజ్మీరానరేష్ పై ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేసినట్లు వినిపిస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఎవెన్యూ ప్లాంటేషన్ పనుల నిర్వహణ కోసం మొక్కల వెంట వెదురుబొంగులను అమర్చడానికి బీర్సాయిపేట డీఆర్ఓ ప్రియాంక అనుమతి పొంది వెదురుబొంగులు తెచ్చుకుంటున్న సమయంలో పట్టుకున్నారని అజ్మీర్‌నరేష్ తెలిపారు. అటవీ శాఖ ఉద్యోగుల ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడు స్థానానికి పోటీపడ్డ నరేష్‌కు దీటుగా ప్రియాంక సైతం పోటీపడగా ఇద్దరు ఉపసంహరించుకొని గీరయ్యను అధ్యక్షుడిని చేయాలని ప్రియాంక చెప్పడంతో తాను ఒప్పుకోక పోవడంతోనే ఈ కక్షసాధింపు జరుగుతుందని నరేష్ వివరించారు. ఈ విషయమై అటవి శాఖ ఉన్నతాధిరులను సంప్రదించగా గీరయ్యను సస్పెండ్‌చేసి ఆయనపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుగుతుందని, ప్రస్తుతం నరేష్‌పై కూడా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏదిఏమైనా అటవి శాఖ ఉద్యోగుల్లో అంతర్యుద్ధం ఏర్పడి అటవీశాఖకు చెడ్డపేరు రాకుండా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని పరిశీలకులు అంటున్నారు.



బీర్సాయిపేట అటవీ రేంజ్ కార్యాలయంలో ఉన్న పట్టుకున్న బొంగుల వ్యాన్

మా ఇష్టం.. కవర్ కప్పం!

- ట్రాఫిక్ నిబంధనలకు పాతర



ట్రాక్టర్‌లోడ్‌పై కవర్ కప్పకుండా ఇసుక రవాణా చేస్తున్న దృశ్యం

ఓవైపు పోలీస్, రెవెన్యూ యంత్రాంగం ఇసుక అక్రమ తరలింపుపై ఉక్కుపాదం మోపుతుంటే మరోవైపు కొందరు అక్రమార్కులు నిబంధనలు తుంగలో తొక్కి ఇసుక రవాణా చేస్తుండడం పలు విమర్శలకు తావిస్తోంది. ట్రాక్టర్ లోడ్‌పై కనీసం పాలిథిన్ కవర్ కప్పకుండా అలాగే తీసుకెళ్లడంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు, పాదచారుల కళ్లలో గాలికి ఇసుక రేణువులు పడి ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ఇకనైనా అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలనే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తం అవుతోంది.

- (ఆంధ్రజ్యోతి ఆదిలాబాద్ స్టాఫ్ ఫొటోగ్రాఫర్)



వడదెబ్బకు జాగ్రత్తలే రక్ష!

- ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి: భైంసా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కాశీనాథ్



భైంసా, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): ప్రచండ భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. గతకొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉన్నాయి. తప్పని పరిస్థితుల్లో మధ్యాహ్నం సమయంలో బయట తిరిగే వారు వడదెబ్బ బారిన పడుతున్నారు. వడదెబ్బ ఒక్కోసారి ప్రాణాలపైకి తెస్తుంది. వడదెబ్బ నివారణ చర్యలు, తగిలాక అందించాల్సిన చికిత్స గురించి భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కాశీనాథ్ పలు సూచనలు చేస్తున్నారు.

వడదెబ్బ...

మండుటెండలో ఎక్కువ సేపు వృత్తిపరమైన కూలీ పనులు చేసేవారు, అత్యవసర పనులపై వెళ్లే వారిలో చాలా మంది వడదెబ్బ బారిన పడుతుంటారు. ఉష్ణోగ్రతలు 105 ఫారన్ హీట్‌కు మించడంతో పాటు నీరసించడం, సొమ్మసిల్లి పడిపోవడాన్నే వడదెబ్బ అంటారు.

సన్ స్ట్రోక్ లక్షణాలు..

శరీర ఉష్ణోగ్రత 105 డిగ్రీల ఫారన్ హీట్ అంత కంటే ఎక్కువకు చేరడం, అయోమయమైన స్థితి, నీరసించి పోవడం, చర్మం పొడిబారడం, నాడి ఎక్కువగా కొట్టుకోవడం, అపస్మారక స్థితి, మాటలు తడబడడం, శ్వాసక్రియ ఎక్కువవడం ఉంటాయి.

కారణాలు..

ఎక్కువ సేపు ఎండలో పనులు చేయడం, తిరగడం, నీరు తక్కువగా తాగడం, ద్రవపదార్థ ఆహారాన్ని సరిగా తీసుకోకపోవడం, మత్తుపానీయాలు ఎక్కువగా సేవించడం, చిన్నపిల్లలు ఎక్కువసేపు ఎండలో ఆడడం వంటి వాటితో వడదెబ్బ తగులుతుంది.

నివారణ..

సాధ్యమైనంత వరకు ఎండలో తిరగకుండా ఉండాలి. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపి, లేదా గొడుగు, తలపాగ ధరించాలి. చలువ కళ్లద్దాలు ధరించాలి. వదులుగా ఉండే తెల్లని దుస్తులు వేసుకోవాలి. నీరు, ద్రవ పదార్థాలు (కొబ్బరి నీరు, మజ్జిగ, అంబలి) ఎక్కువగా తీసుకోవాలి. ఓఆర్ఎస్ ద్రవాన్ని తీసుకోవాలి. ఆహారాన్ని తక్కువ మొత్తంలో ఎక్కువసార్లు తీసుకో వాలి. నీడలో గడపాలి. ఇంట్లో ఉష్ణోగ్రత తగ్గేలా కిటికీలు, తలుపులకు తెరలను లేదాచాపలను కట్టుకోవాలి. శరీరానికి చెమట ఎక్కువగా పడుతుంది. కాబట్టి సాయంత్రం స్నానం తప్పకుండా చేయాలి.

చేయకూడనివి...

నల్లని వస్త్రాలు ధరించకూడదు. మత్తు పానీయాలు సేవించకూడదు. టీ, కాఫీలను తక్కువ చేయాలి. ఎండలో ఎక్కువ తిరగొద్దు.



బాధితుడికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి డా. యూ.కాశీనాథ్

చికిత్స..

వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడగా ఉన్న ప్రదేశానికి తీసుకెళ్లి ఇతర సపర్యలు చేయాలి.

- శరీర ఉష్ణోగ్రత తగ్గడానికి తడిగుడ్డతో పలుమార్లు తుడవాలి.
- నీరు ద్రవ పదార్థాలు, పండ్ల రసాలు తాగాలి.
- ఐస్ ముక్కలను గుడ్డలో ఉంచి శరీరమంత అద్దితే చాలా మంచిది. అపస్మారక స్థితికి వెళ్తే ఐటీ సెలైన్ ఎక్కించాలి.
- రోగి నాడి, బీపీ, శరీర ఉష్ణోగ్రతలను తరుచు జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. వీలైనంత త్వరగా ఆసుపత్రిలో చేర్పించాలి.

చలివేంద్రం ప్రారంభం

నేరడిగొండ, ఏప్రిల్8 (ఆంధ్రజ్యోతి): నూతన చలివేంద్రాన్ని మంగళవారం నేరడిగొండ పంచాయతీ కార్యదర్శి నర్సారెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల దాహం తీర్చేందుకు బస్సు సెల్టర్ వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. అలాగే కార్యాలయాలకు వచ్చే పోయే ప్రజలు సైతం ఈ రహదారి గుండా వెళ్తుంటారని వారు సైతం చలివేంద్రాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 38.6 : కనిష్ఠం 25.8
నిర్మల్ జిల్లా వార్తలు
8
బుధవారం 9 ఏప్రిల్ 2025



ఘనంగా మహదేవ్ కాటి ధ్వజ ప్రతిష్ఠాపన

బాసర,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):బాసర మండల కేంద్రంలో మంగళవారం మహదేవ్ కాటి ధ్వజ ప్రతిష్ఠాపన వేడుక ఘనంగా నిర్వహించారు. మొదట గోదావరి నదీతీరంలో ధ్వజస్తంభానికి జలాభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించి అక్కడి నుంచి శోభాయాత్ర ప్రారంభమైంది. గ్రామ ప్రధానవీధుల గుండా శోభాయాత్ర కొనసాగింది.స్థానిక బొర్రగణేష్ ఆలయం వద్ద మహదేవ్ కాటి ధ్వజ ప్రతిష్ఠాపన చేశారు.బుధవారం ఉదయం గ్రామస్తులు మహదేవ్ కాటికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఈ వేడుకలను ముగిస్తారు.పరమశివుని ఆరాధనలో భాగంగా బాసర గ్రామస్తులు సంప్రదాయంగా ఈ వేడుకలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తూ వస్తున్నారు.



గడ్డెన్న వాగు ప్రాజెక్టు ఇదే


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్

సాగునీటి పనులకు భారీగా ప్రతిపాదనలు

- మరమ్మతుల కోసం రూ.160 కోట్లతో ప్రతిపాదనలు
- నిధులు మంజూరైతే వేసవిలోగా పనుల పూర్తికి సన్నాహాలు
- ఖరీఫ్‌లో అన్ని ప్రాజెక్టుల చివరి ఆయకట్టుకు నీరందించే ప్రయత్నాలు
- సర్కారుపై ఒత్తిడి తీసుకువస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి
- జిల్లాలో ఇప్పటికే పూర్తయిన సమీక్ష సమావేశాలు

నిర్మల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏళ్ల నుంచి మరమ్మతులకు నోచుకోలేకపోతున్న పలు ప్రాజెక్టులకు సంబంధించి దాదాపు రూ.160 కోట్ల రూపాయలతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి సర్కారుకు నివేదించారు. ఈ నెలాఖరులోగా ఎలాగైనా నిధులు మంజూరు చేసే విధంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సర్కారుపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ముఖ్యంగా నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లోని ప్రాజెక్టులకు సంబంధించిన కాలువల మరమ్మతుల కోసం ఈ ప్రతిపాదనలు రూపొందించారు. గతంలో కూడా ఈ ప్రాజెక్టుల కాలువల మరమ్మతుల కోసం రూపొందించిన ప్రతిపాదనలకు మోక్షం దక్కలేదు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయని కారణంగా ప్రాజెక్టుల కాలువల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారింది. కాలువలకు మరమ్మతులు లేని కారణంగా ప్రాజెక్టుల నుంచి విడుదల చేసే నీరు కొంత మేరకు మాత్రమే పంట పొలాలకు అందుతుండగా ఇప్పటి వరకు చివరి ఆయకట్టు వరకు కూడా సాగునీరు అందని పరిస్థితి కొనసాగుతోంది. జిల్లాలోని ఎస్సారెస్పీ ప్రాజెక్టు పరిధిలో గల సరస్వతీ కాలువ అలాగే స్వర్ణ ప్రాజెక్టుకు సంబంధించిన కాలువలతో పాటు గడ్డెన్న వాగు ప్రాజెక్టు కాలువలు, కడెం ప్రాజెక్టు కాలువల పరిస్థితి మరమ్మతులు లేక అస్తవ్యస్తంగా మారింది. ఈ ప్రాజెక్టుల కాలువల కింద దాదాపు 1.30 లక్షల ఎకరాల వరకు పంట పొలాలు సాగవుతున్నాయి. ప్రతిఏటా వేసవికాలం కన్నా ముందుగానే ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రతిపాదనలు రూపొందించడం ఆ ప్రతిపాదనలను సర్కారుకు పంపడం సహజంగా మారింది. అయితే ప్రభుత్వం ఏయేటికి ఆ ఏడు నిధులను మంజూరు చేయకపోవడంతో వాటి పరిస్థితి ఆగమ్యగోచరమవుతోంది. అయితే కొద్ది రోజుల క్రితం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బీజేఎల్పీ నేత హోదాలో ఇరిగేషన్ శాఖ అధికారులతో జిల్లాలోని సాగునీటి కాలువల పరిస్థితులపై ప్రత్యేకంగా సమీక్ష జరిపారు. అధికారులతో ఫీడ్‌బ్యాక్ తీసుకున్న మహేశ్వర్‌రెడ్డి అన్ని కాలువలకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలంటూ సూచించారు. మహేశ్వర్‌రెడ్డి సూచనల మేరకు అధికారులు యుద్ధ ప్రతిపాదికన ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు. ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర లభించే విధంగానే కాకుండా నిధులు సైతం మంజూరయ్యే విధంగా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సర్కారుపై ఒత్తిడి తీసుకువస్తూ ముమ్మరంగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. నెలాఖరులోగా నిధులు విడుదలైనట్లయితే జూన్ మొదటి వారంలోగా కాలువల మరమ్మతుల పనులను పూర్తి చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇదే జరిగితే రాబోయే ఖరీఫ్ చివరకు అలాగే రబీలో రైతులకు చివరి ఆయకట్టు వరకు కూడా సాగునీరు అందించే అవకాశం ఏర్పడుతుందని చెబుతున్నారు.


సాగునీరు అందించే సరస్వతీ కాలువ ఇదే

రూ. 90 కోట్లతో సరస్వతీ కాలువకు ప్రతిపాదనలు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని సరస్వతీ కాలువ మరమ్మతుల కోసం ఇరిగేషన్‌శాఖ అధికారులు రూ. 90 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించారు. 37వేల ఎకరాలకు సాగునీరు అందించే సరస్వతీ కాలువ మరమ్మతులు చాలా ఏళ్ల నుంచి నోచుకోవడం లేదు. ఈ కాలువకు చాలా చోట్ల గండ్లు పడడం, లైనింగ్ చెడిపోవడంతో పాటు కాలువలో పూడికతో పాటు పిచ్చిమొక్కలు కూడా ఎక్కువగా పేరుకుపోయాయి. దీని కారణంగా ప్రాజెక్టు నుంచి ఈ కాలువ ద్వారా పంట పొలాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదు. ప్రతియేటా ఈ సమస్య పెరిగిపోతుందే తప్ప రైతులకు ప్రయోజనం చేకూరడం లేదు. అయితే ప్రభుత్వం ఇరిగేషన్ రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో సరస్వతీ కాలువ మరమ్మతులకు మోక్షం లభించే అవకాశం ఉందంటున్నారు. రూ. 90 కోట్లు మంజూరైతే ఇక సరస్వతీ కాలువకు పూర్వ వైభవం సమకూరుతుందని, దీంతో దాదాపు 37వేల ఎకరాలకు ఖరీఫ్, రబీ సీజన్‌కు గానూ చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందే అవకాశం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. నిధులు మంజూరు కాగానే మరో నెల రోజుల్లోగా పనులను చేపట్టేందుకు సైతం అధికారులు సంసిద్ధంగా ఉన్నారు.

స్వర్ణ కాలువలదీ ఇదే దుస్థితి

కాగా జిల్లాలోని స్వర్ణప్రాజెక్టుకు సంబంధించిన కాలువల పరిస్థితి కూడా ఎంతో దయనీయంగా ఉందని అంటున్నారు. స్వర్ణప్రాజెక్టు కాలువలతో పాటు ప్రాజెక్టు మరమ్మతులకు సైతం రూ.30 కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలను రూపొందించి సర్కారుకు నివేదించారు. చాలా యేళ్ళ నుంచి స్వర్ణప్రాజెక్టుకు గానీ దీని పరిధిలోని కాలువలకు గాని మరమ్మతులు చేయకపోతుండడం రైతులకు శాపంగా మారింది. దాదాపు 10వేల ఎకరాలకు ఈ ప్రాజెక్టు కాలువల ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించాల్సి ఉంది. మరమ్మతులు లేక ఇందులో నుంచి కేవలం ఐదు నుంచి ఆరు వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతోందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే పనులు చకచకా చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

గడ్డెన్న ప్రాజెక్టుకు రూ. 53 కోట్లతో ప్రతిపాదనలు


ఇదిలా ఉండగా గడ్డెన్నవాగు ప్రాజెక్టుతో పాటు దాని పరిధిలోని కాలువల మరమ్మతులకు దాదాపు రూ.53 కోట్లతో రూపాయలతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుతం ఈ ప్రతిపాదనలు సర్కారు పరిశీలనలో ఉన్నాయి. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోద ముద్ర వేసి నిధులు మంజూరు చేస్తే వేసవి చివరి వరకు ఈ పనులను పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు కూడా సాగునీరు అందించేందుకు ప్రాజెక్టు అధికారులు సిద్ధమవుతున్నారు.

కడెంకు మహర్దశ పట్టేనా..?

కాగా జిల్లాలోని మరో ప్రధానమైన ప్రాజెక్టు కడెం కూడా దయనీయ పరిస్థితిలో ఉన్నాయి. ప్రభుత్వం ప్రాజెక్టుకు సంబంధించిన గేట్ల మరమ్మతులు, కౌంటర్ వేటర్‌లతో పాటు గ్రీసింగ్, ఇతర పనులకు నిధులు మంజూరు చేయడమే కాకుండా ఆ పనులను సైతం పూర్తి చేయించింది. అయితే కీలకమైన కాలువల మరమ్మతులకు మాత్రం ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయకపోవడంతో వాటి పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. చివరి ఆయకట్టు రైతులు ప్రతిఏటా మరమ్మతులు పనులను చేపట్టాలంటూ డిమాండ్ చేస్తుండడమే కాకుండా సంబంధిత ప్రజా ప్రతినిధులపైనా, అధికారులపైనా ఒత్తిడిలు కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వం కడెం ప్రాజెక్టు విషయంలో పూర్తిగా నిర్లక్ష్య ధోరణి అవలంబించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కడెం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా నిధులను సైతం విడుదల చేసి పనులను పూర్తి చేయించింది. అయితే కాలువల కోసం కూడా అధికారులు ప్రతిపాదనలు పంపి సర్కారు ఆమోదం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసినట్లయితే ఈ కాలువల మరమ్మతులు పనులు కూడా వేసవిలోగానే పూర్తయ్యే అవకాశాలున్నాయని అంటున్నారు. మొత్తానికి ప్రభుత్వం కాలువల ప్రతిపాదనలకు సంబంధించి నిధులు మంజూరు చేసినట్లయితే చివరి ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందే అవకాశం ఏర్పడనుందని అంటున్నారు.

నిధుల విడుదలకు బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి ప్రయత్నాలు

ఇదిలా ఉండగా ఇరిగేషన్ అధికారులు సరస్వతీ కాలువల, గడ్డెన్న, స్వర్ణ కాలువలతో పాటు కడెం ప్రాజెక్టు కాలువల మరమత్తుల కోసం దాదాపు రూ.160 కోట్లతో రూపొందించిన ప్రతిపాదనలకు ఆమోద ముద్ర పడే విధంగా బీజెఎల్పీ నేత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి తన వంతు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఇప్పటికే ఆయన నిధుల విషయమై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్‌రెడ్డితో పలుసార్లు చర్చించి ఒత్తిడి తీసుకువస్తున్నారు. అలాగే సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సైతం ఆయన సంప్రదింపులు జరుపుతున్నారు. ఈ నెలాఖరులోగా ఎలాగైనా నిధులు విడుదలయ్యే విధంగా మహేశ్వర్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తే 1.50 లక్షల ఎకరాల పంట భూముల చివరి ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఏర్పడుతుందని అంటున్నారు.


కడెం ప్రాజెక్టు ఇదే

మెప్మాలో రెండు కోట్ల స్కాం

- మహిళా సభ్యుల రుణాల నిధులు స్వాహా
- ఎస్పీ ఆదేశాలతో పోలీసుల విచారణ


నిర్మల్ మెప్మా కార్యాలయంలో స్త్రీనిధి రుణాల అక్రమాలపై విచారణ జరుపుతున్న ముథోల్ ఎస్సై సంజీవ్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మున్సిపల్ పరిధిలోని మెప్మాలో దాదాపు రెండు కోట్ల రూపాయల అవకతవకలు జరిగినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గత కొంతకాలం నుండి మెప్మాలో పని చేస్తున్న ఆర్పీలు మహిళా పొదుపు సంఘాల సభ్యుల పేరిట దాదాపు రెండు కోట్ల రూపాయలకు పైగా రుణాలు పక్కదోవ పట్టించినట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు జిల్లా ఎస్పీ దీనిపై ప్రత్యేక విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా విచారణకు సంబంధించిన బాధ్యతలను ముథోల్ ఎస్సై సంజీవ్‌కు అప్ప జెప్పారు. దీంతో మంగళవారం ముథోల్ ఎస్సై సంజీవ్ ఇక్కడి మున్సిపాలిటీలోని మెప్మా కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. మొత్తం రికార్డులను పరిశీలించి దాదాపు రెండు కోట్ల రూపాయలకు పైగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. దీంతో రికార్డులను స్వాధీనం చేసుకొని మరింత లోతుగా దర్యాప్తు జరుపనున్నట్లు ఎస్సై సంజీవ్ వెల్లడించారు. విచారణ అనంతరం బాధ్యులపై తగిన చర్యలు తీసుకునేందుకు సిఫారసు చేయనున్నట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ

చొండి గ్రామంలో కార్డన్‌సెర్చ్

కుభీర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చొండి గ్రామంలో మంగళవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న పోలీసులు గ్రామంలో తనిఖీలు చేశారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని 57ద్విచక్రవాహనాలు, ఒక నాలుగు చక్రాల వాహనం, 5ఆటోలను సీజ్ చేవారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఎస్పీ అవినాష్ మాట్లాడారు. ప్రజల భద్రత కోసమే పోలీసులు ఉన్నారని, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఆన్‌లైన్‌మోసాలతో జాగ్రత్తగా ఉండాలని, ఎవరికైనా బెదిరింపు కాల్స్ గాని, లేదా ఏదయిన ఆఫర్ కాల్స్ గాని వస్తే నమ్మకండని ముందు అది నిజమోకాదో నిర్ధారించుకోవాలని, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భైంసా రూరల్ సీఐ నైలు, ఎస్సైలు రవీందర్, శంకర్, అశోక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

విజయవంతంగా నారీశక్తి కార్యక్రమం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ జానకి షర్మిల వినూత్న ఆలోచనతో ప్రారంభమైన నారీశక్తి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. మహిళా దినోత్సవం సందర్భంగా గత నెల 7న ప్రారంభమైన నారీశక్తి కార్యక్రమంలో మహిళా పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేస్తున్నారు. 100 నెంబర్‌కు డయల్ చేసిన వాటిని అటెండ్ చేయడం, బ్లూకోర్ట్, పెట్రోకార్ తదితర కార్యక్రమాలు విజయవంతంగా చేపట్టారు. మంగళవారం నిర్మల్ జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో తనిఖీలు చేశారు. ట్రాఫిక్ నియమాలు పాటించని వాహనదారులకు అవగాహన కల్పించారు. 100 నెంబర్‌కు కాల్ వస్తే

నిరుపేదలకు నాణ్యమైన భోజనం అందించేందుకే సన్న బియ్యం పంపిణీ

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


తర్లపాడ్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్


తర్లపాడ్ గ్రామంలో రేషన్ లబ్ధిదారుల నివాసంలో భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

ఖానాపూర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ మండలంలోని తర్లపాడ్ గ్రామంలో రేషన్ లబ్ధిదారులైన పల్లెర్ల సుజాత రాజేశ్వర్ దంపతుల నివాసంలో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ అభిలాష అభినవ్ భోజనం చేశారు. ఈ సందర్భంగా సుజాత - రాజేశ్వర్ దంపతుల పిల్లలతో మాట్లాడారు. జీవితంలో ఉన్నత చదువులు చదవాలని వారికి సూచించారు. గ్రామంలోని రేషన్ లబ్ధిదారులతో మాట్లాడుతూ... సన్నబియ్యం పంపిణీపై నాణ్యత, రుచికి సంబంధించిన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులతో కలిసి భోజనం చేయడం ఆనందాన్ని కలిగించిందన్నారు. ప్రభుత్వం నిరుపేదల కోసం అందజేస్తున్న సన్నబియ్యాన్ని దళారులకు అమ్మవద్దని సూచించారు. నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అర్హులైన వారంతా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు రుణాలు పొంది స్వయం ఉపాధిని పొందాలన్నారు. ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరా మహిళలను దశల వారీగా మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించిన కలెక్టర్ కాలనీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల భవనానికి ప్రహరీ గోడ నిర్మాణం కోసం నిధులను మంజూరు చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ ఆర్డీవో రత్న కళ్యాణి, ఖానాపూర్ తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్ రావు, పంచాయతీ కార్యదర్శి రిజ్వాన, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డిఫ్యాక్టో సీఎంలా మీనాక్షి నటరాజన్

- సీఎం రేవంత్ ఇంట్లో కూర్చోవాలి
- బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ డీఫ్యాక్టో సీఎంలా వ్యవహరించడం శోచనీయమని బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మీనాక్షి నటరాజన్ ఏకంగా సచివాలయానికి వచ్చి మంత్రులతో కలిసి హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ భూముల వ్యవహారాన్ని సమీక్షించడాన్ని తప్పు పట్టారు. రేవంత్‌రెడ్డి ఇక డమ్మీ సీఎం అనేది స్పష్టమైపోయిందని, ఆమె తీరు చూస్తే సీఎం రేవంత్ ఇంట్లో కూర్చోవాలా అని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పాలనా పగ్గాలను రాహుల్‌గాంధీ తన చేతిలోకి తీసుకున్నట్టుగా అర్థమవుతోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న కొత్తలో మీనాక్షి నటరాజన్ ప్రభుత్వ వ్యవహారాల్లో తాను జోక్యం చేసుకోనని చెప్పారని, కానీ ఆమె మాట తప్పి ఇప్పుడు అందుకు విరుద్ధంగా ఏకంగా సచివాలయానికి రావడం వెనుక రాహుల్‌గాంధీ ఆదేశాలు ఉన్నాయని తేలిపోయిందన్నారు. ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోనే తన నివాసంలో ఉండగా మీనాక్షి నటరాజన్ ఏకంగా సచివాలయానికి వచ్చి మంత్రులతో కలిసి రివ్యూ చేయడాన్ని బట్టి సీఎం రేవంత్‌రెడ్డి ఇక కోరలు లేని పాము అని అర్థం అవుతుందన్నారు. జై బాపు, జై భీమ్,జై సంవిధాన్ తమ విధానమంటున్న కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ పరిరక్షణ తమ ధ్యేయమని కార్యక్రమాలను నిర్వహిస్తూ, పాదయాత్రలు చేస్తున్న కాంగ్రెస్ నేతలు... రాజ్యాంగ పరిరక్షణ విధానం ఓ నినాదం గానే మిగిలిపోయిందని, అది ఆచరణలో శూన్యమని మీనాక్షి నటరాజన్ నిరూపించాలని పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీలుగాపని చేసిన దిగ్విజయ్‌సింగ్, గులామం నబీ ఆజాద్, వీరప్ప మొయిలీ, వయలార్ రవి వంటి నేతలు ఏనాడు ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేదని, గతంలో ప్రధానిగా, కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న రాజీవ్‌గాంధీ అప్పట్లో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న అంజయ్యను ఎయిర్‌పోర్ట్‌లో అవమానించారని, తండ్రి రాజీవ్‌గాంధీ బాటులోనే కుమారుడు రాహుల్‌గాంధీ నడుస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సర్కారును రాహుల్‌గాంధీ రిమోట్ కంట్రోల్ ద్వారా నడిపించాలనుకుంటున్నారని, అందుకే మీనాక్షి నటరాజన్ డీఫ్యాక్టో సీఎంగా వ్యవహరిస్తున్నారన్నారు. మీడియా సమావేశంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మేడిసెమ్మె రాజు, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, తాజా మాజీ కౌన్సిలర్లు నరేందర్, నవీన్, పద్మాకర్, సత్యం చంద్రకాంత్, ముత్యంరెడ్డి, జమాల్, విలాస్, విజయ్, తిరుమల చారి, ముత్యం పాల్గొన్నారు.


శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ఛత్రపతి శివాజీ మార్గంలో నడవాలి

మామడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఛత్రపతి శివాజీ మహారాజ్ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. మామడ మండలంలోని పరిమండల్ గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్ఫూర్తిని, ధైర్య సాహసాలను నేటియువత ఆదర్శంగా తీసుకొని వారి బాటలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, మండల అధ్యక్షులు రంజిత్, నాయకులు బాపురెడ్డి, మల్లేష్, గోవర్ధన్‌రెడ్డి, రిత్విక్‌తో పాటు మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మరిల్లు కాలనీలో చోరీ


ఇంటి లోపల పరిశీలిస్తున్న సీఐ కృష్ణ, ఎస్సై లింబాద్రిలు, క్లూస్ టీం సిబ్బంది

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండాపూర్ గ్రామ సమీపంలోని బొమ్మరిల్లు కాలనీలో చోరీ జరిగిందని రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మంగళవారం ఉదయం 8 గంటలకు బొమ్మరిల్లు టౌన్షిప్‌లో బొబ్బిలి శ్రీకాంత్ అనే అతని ఇంటి మేన్ డోర్ వెనుక ఎవరో గుర్తు తెలియని దొంగలు తాళం పగలగొట్టి అందులోకి ప్రవేశించి బెడ్ రూమ్ బీరువాలో గల బంగారం, కొంత నగదును దొంగించారు. వాటి విలువ సుమారు 2 లక్షల 40 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. సంఘటన స్థలాన్ని సీఐ కృష్ణ పరిశీలించారు. ఫిర్యాదు రాగానే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు.

రోడ్డు ప్రమాదం కేసులో

నిందితుడికి 9 నెలల జైలు

నిర్మల్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం మంగళవారం తీర్పునిచ్చింది. న్యాయస్థాన లైజన్ అధికారి డల్లుసింగ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని జాతీయ రహదారిపై 2016 సంవత్సరంలో జరిగిన రహదారి ప్రమాదంలో నిందితుడైనటువంటి కొండ సంతోష్ గౌడ్ అనే వ్యక్తికి 9 నెలల జైలు శిక్ష, 1000 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

నేడు షెడ్యూల్ కుల సంఘాల సమావేశం

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న అంబేద్కర్ జయంతి వేడుకల నిర్వహణపై బుధవారం ఎస్సీ కుల సంఘాలతో ఉదయం కలెక్టర్ కాన్ఫరెన్స్ మినీ హాల్‌లో ఉదయం 10:30 గంటలకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి వి. రాజేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సంఘాల నాయకులు హాజరై తగు సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

లక్ష్మణచాంద, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీజెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. గడిచిన కాలంలో పార్టీ ఘన విజయాలను, మైలురాళ్ల వంటి మధుర జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాండ్ల చిన్నయ్య, వేడుకల కన్వీనర్ అడ్వాల రమేష్, మాజీ సర్పంచ్ సురకంటి ముత్యంరెడ్డి, నాయకులు గుడ్ల రంజిత్, రవీందర్‌గౌడ్, దొంతుల రాజన్న, కార్యకర్తలు ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు చెల్లించాలి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. జిల్లా అధ్యక్షుడు తిరుపతి, ప్రధాన కార్యదర్శి డి.నూతన్‌కుమార్ మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు.